సాక్షి నంద్యాల

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



19న ఎల్లెల్సీకి నీటి విడుదల

హొళగుంద: తాగునీటి అవసరాల నిమిత్తం టీబీ డ్యాం నుంచి ఎల్లెల్సీకి ఈ నెల 19న నీరు విడుదల చేయనున్నారు. రోజూ 500 క్యూసెక్కుల చొప్పున 20 రోజుల పాటు నీటి విడుదల కొనసాగనుంది.



వీనుల విందుగా ..

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని నిత్యక ళావేదికపై శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన శృతిలయ మ్యూజిక్ అకాడమీ, కర్ణాటక మ్యూజిక్ వారి గాత్రకచేరి భక్తులను అలరించింది.



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మకు విశేష పూజలు చేశారు.

పల్లె ప్రగతికి 'ఆర్థిక' అండ

- 488 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల
- జిల్లాకు రెండు విడతల్లో రూ.41.18 కోట్లు
- అభివృద్ధి, పారిశుద్ధ్య పనుల్లో మరింత వేగం
- మరో విడత నిధులు వచ్చే అవకాశం

గోస్పాడు: గ్రామ పంచాయతీల అభివృద్ధికి మరింత 'ఆర్థిక' అండ లభించేలా రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. ఇప్పటికే పల్లెసీమలు ప్రగతి పథంలో పరుగులు పెట్టేందుకు ఇతోధికంగా జగనన్న ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో రూ.40 లక్షల విలువ చేసే పనులను చేపడుతోంది. అలాగే ప్రతి మండలానికి రూ. 60 లక్షలను కూడా మంజూరు చేసింది. ఈ నిధులకు తోడు 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ కావడంతో పల్లెల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కానున్నాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోని గ్రామాల రూపురేఖలను తీర్చిదిద్దేందుకు తాజాగా 15వ ఆర్థిక సంఘం నిధులు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయి. వీటితో సీసీ రోడ్లు, కాలువలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. నంద్యాల జిల్లాలో 488 పంచాయతీలకు గాను రెండు విడతల్లో రూ.41.18 కోట్లు జమ చేసింది. అన్ని గ్రామ పంచాయతీలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాలు ఓపెన్ చేసిన నేపథ్యంలో పీఎఫ్ఎంఎస్ సిస్టమ్‌లో ఆయా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోకి ఈ నిధులు జమ అయ్యాయి. వీటిని 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఆయా పంచాయతీల ఖాతాల్లో పీఎఫ్ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ద్వారా జమ చేసింది. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు పారిశుద్ధ్య పనులు, వివిధ రకాల చార్జీల చెల్లింపు, చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించవచ్చు.



గోస్పాడు గ్రామ సచివాలయం

పరుగులు పెట్టనున్న అభివృద్ధి

ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు పరుగులు పెట్టనున్నాయి. జిల్లాలోని 488 గ్రామ పంచాయతీలకు తాజాగా సంఘం నిధులు జమయ్యాయి. 2022–23 ఆర్థిక సంఘంలో ఇచ్చిన ముందస్తు ప్రణాళిక ద్వారా మొదటి విడత కింద రూ.13.41 కోట్లు, రెండో విడత కింద .రూ27.76 కోట్ల చొప్పున నిధులు విడుదలయ్యాయి. మరో నెల రోజుల్లో 2023–24 నిధులు కూడా విడుదల కానున్నాయని అధికారులు వెల్లడించారు. దీంతో పంచాయతీల్లో ఇంతవరకు జరగని స్థాయిలో అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి. మారుమూల ప్రాంతాలు, అనుబంధ గ్రామాలు కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీల్లో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామస్వరాజ్య ఈ–పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

ఖర్చు చేయాల్సిన విధి విధానాలు...

పంచాయతీలకు జమ అయిన నిధులు టైడ్ 60 శాతం, అన్‌టైడ్ కింద 40 శాతం నిధులు విడుదల అవుతాయి. అన్‌టైడ్ కింద సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, వీధి దీపాల నిర్వహణ, కరెంటు బిల్లుల చెల్లింపు, గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాల్సి ఉంటుంది. టైడ్ నిధుల కింద తాగునీటి అవసరాలు, చేతి పంపులు, నీటి ట్యాంకులు, మోటార్ల నిర్వహణ, శానిటేషన్ వంటి పనుల నిర్వహించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం విడుదలైన 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ నిధులతో ఆయా గ్రామ పంచాయతీలో నెలకొన్న అవసరాలను తీర్చుకునేందుకు వెసులుబాటు ఉంది.



కానాలపల్లిలో కొత్తగా నిర్మించిన సిమెంటు రోడ్డు



జిల్లెల్లలో మంచినీటి పైపులైన్ వేస్తున్న దృశ్యం

మండలాల వారీగా నిధుల మంజూరు ఇలా (రూ.లక్షల్లో)

మండలం	మొదటి విడత	రెండో విడత
ఆళ్లగడ్డ	30.05	87.50
ఆత్మకూరు	35.81	76.60
బనగానపల్లె	94.95	20.73
బండిఆత్మకూరు	50.35	108.71
బేతంచెర్ల	68.51	103.96
చాగలమర్రి	38.56	108.82
డోన్	5.13	131.55
దొర్నిపాడు	29.34	53.37
గడివేముల	32.22	90.09
గోస్పాడు	35.05	81.73
జూపాడుబంగ్లా	35.05	79.83
కోవెలకుంట్ల	44.34	98.77
కొలిమిగుండ్ల	65.85	114.70
కొత్తపల్లి	29.05	73.71
మహానంది	39.17	82.94
మిడుతూరు	38.39	90.77
నందికొట్కూరు	24.42	74.06
నంద్యాల	85.15	104.31
అవుకు	61.16	115.11
పగిడ్యాల	31.29	71.87
పాములపాడు	45.67	83.20
పాణ్యం	56.34	107.72
ప్యాపిలి	65.74	153.13
రుద్రవరం	44.30	114.76
సంజామల	44.95	82.53
శిరివెళ్ల	45.77	114.79
ఉయ్యాలవాడ	32.58	61.26
వెలుగోడు	50.52	103.63

ఈ-పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం



ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఈ నిధులను సక్రమంగా వినియోగించాలి. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు గ్రామాల్లో అవసరమైన పనులు మాత్రమే చేస్తున్నాం. ఇప్పటికే పనులు ప్రారంభించాం. మౌలిక వసతుల కల్పనకు వినియోగించుకోవచ్చు. ఉపయోగించిన నిధులు, బిల్లులు, పనుల వివరాలను గ్రామ స్వరాజ్య ఈ– పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం.

– అనసూయ, ఎంపీడీఓ, గోస్పాడు

నిధులను సక్రమంగా ఖర్చు చేయాలి



ప్రభుత్వం ద్వారా రూ.41.18 కోట్లు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. ప్రాధాన్యత, మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. మంజూరైన నిధుల్లో 60 శాతం మంచినీరు, శానిటేషన్‌కు ఖర్చు చేయాలి. మిగిలిన 40 శాతం నిధులతో నిబంధనలను అనుసరించి రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు ఇతరత్రా బిల్లుల చెల్లింపులు చేసుకోవచ్చు.

– మంజులవాణి, డీపీఓ, నంద్యాల

న్యూస్‌రీల్

మందలూరు చేరిన అహోబిలేశుడు



పూజలందుకున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం: అహోబిల పార్వేట ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామి వారి పల్లకీ శుక్రవారం మండల పరిధిలోని మందలూరుకు చేరుకుంది. వీఆర్వో ఫకృద్దీన్, పంచాయతీ కార్యదర్శి ఓబులేసు గ్రామ పెద్దలు ఎదురేగివెళ్లి పల్లకీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బోయిలు స్వామి వారి పల్లకీని గ్రామంలోని ఎనిమిది తెలపులపై కొలువుదీర్చగా ఆయా తెలుపుల యజమానులతో పాటు చుట్టు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

బొమ్మలసత్రం: జిల్లాలోని పోలీస్‌శాఖలో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే సందర్భంగా సిబ్బంది సమస్యలను నేరుగా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై వచ్చిన వినతులను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు పోలీస్‌శాఖ నుంచి మెరుగైన సేవలు అందేలా చొరవచూపాలన్నారు.కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ సంతోష్, ఆర్ఎస్ఐ వీరన్న పాల్గొన్నారు.

ఓర్వకల్లు విమానాశ్రయానికి రూ.11.01 కోట్లు

నంద్యాల (సెంట్రల్): ఓర్వకల్లు విమానాశ్రయంలో సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా 30 నెలలకు సంబంధించి రూ.11.01 కోట్లకు పాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యువరాజ్ జీవో నంబర్–6ను విడుదల చేశారు. 2023 మే 1 నుంచి 2025 నవంబర్ 31 వరకు ఈ నిధుల్ని ఉపయోగించే విధంగా ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నిధులతో విమానాశ్రయంలో విద్యుత్, సిబ్బంది జీతభత్యాలు, పారిశుద్ధ్యం, భద్రత, ఏఆర్ఎఫ్ఎఫ్, ఎయిర్ సైడ్ ఆపరేషన్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు.

జెడ్పీ సర్వసభ్య సమావేశం 21కి వాయిదా

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అనివార్య కారణాలతో ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి శుక్రవారం తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ భవనంలో ప్రారంభమవుతుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, మంత్రి గుమ్మనూరు జయరాం, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కలెక్టర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, జెడ్పీటీసీ, ఎంపీపీలకు సమావేశం విషయమై సమాచారం అందించామన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాల ఎంపికకు కసరత్తు

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్ల లెక్కింపు కేంద్రాల ఎంపికకు కసరత్తు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ సెంటర్ల నిర్వహణ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ శ్రీనివాసులు శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, శాంతిరాం, ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజీలు అనుకూలంగా ఉన్నాయన్నారు. జిల్లాలోని గుడ్ షెప్పర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, పాలిటెక్నిక్ కళాశాల, నెరవాడ గురుకుల పాఠశాల తదితర కళాశాలలు అనుకూలంగా లేవని రాజకీయ పార్టీలు ఆక్షేపిస్తే గతంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నీ ఆర్జీఎం ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించాలని అంగీకరించడంతో జిల్లాలో గుర్తించిన సంబంధిత కళాశాలల జాబితాను ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించి తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుంచి సయ్యద్ రియాజ్‌బాషా, బీజేపీ నుంచి చంద్రశేఖర్, వైఎస్ఆర్‌సీపీ నుంచి సూర్యనారాయణ రెడ్డి, సీపీఐ(ఎం) నుంచి రమేష్ కుమార్, బీఎస్పీ నుంచి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు, చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నిలకడగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చియార్డులో ఎండుమిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మార్కెట్‌లో సూపర్–10 సరకు అమ్మకాలు జోరుగా జరిగాయి. ఈ రకం జనరల్ గరిష్ట ధర క్వింటం రూ.16 వేలు, మధ్యస్థ ధర రూ.14,600, కనిష్ట ధర రూ.13,500 గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ట ధర క్వింటం రూ.8 వేలు, మధ్యస్థ ధర రూ.6,200, కనిష్ట ధర రూ.5,200గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి

నంద్యాల: జొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిడుతూరు, పాములపాడు, నందికొట్కూరు మండలాల్లో జొన్న కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. జొన్నలు కొనుగోలు కేంద్రాలకు చేరేలా రవాణా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన గన్ని బ్యాగులను కూడా సమకూర్చాలన్నారు. అలాగే కౌలు రైతులందరికీ రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. మిరప కొనుగోలు సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలిసే విధంగా మార్కెటింగ్ కమిటీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

- జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జొన్నలు కొనుగోలుకు సంబంధించి డీసీఎంఎస్, సివిల్ సప్లయ్, కో–ఆపరేటివ్ మార్క్‌ఫెడ్ తదితర ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలను బలోపేతం చేసి వేగవంతం చేయాలన్నారు. ఏ ప్రాంతం నుంచి ఎంత పంట రవాణా చేశారో సంబంధిత మొత్తం ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు రైతుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత తనిఖీ కోసం తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సివిల్ సప్లై డీఎంను జేసీ ఆదేశించారు. ఇప్పటి వరకు 5,748 మెట్రిక్ టన్నుల జొన్న కొనుగోలు జరిగిందన్నారు. గన్నీ సంచులు సరైన సమయంలో రైతులకు అందించి నమూనా సేకరణ కూడా త్వరితగతిన పూర్తి చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. మామిడి పంటలకు పండు ఈగ వాటిల్లకుండా సరైన సమయంలో సంబంధిత మెటీరియల్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారులకు ఆదేశించారు.
- మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ జొన్న కొనుగోలు కేంద్రాలకు అవసరమైన రవాణా సౌకర్యం, గన్నీ సంచులను రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ గడివేముల మండలంలో జిందాల్ ఫ్యాక్టరీ సమీపంలో రైతులు వేసిన జొన్న పంట ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం వలన నాణ్యత తగ్గి కొనుగోలుకు అవకాశం లేకుండా పోతుందని, పశుదాణా కింద కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులను సూచించారు. మిగిలిన మొత్తాన్ని సంబంధిత ఫ్యాక్టరీ నుంచి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- అనంతరం నాబార్డ్ వారి 2024–25 పొటెన్షియల్ లింక్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు రాజమోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, నాబార్డ్ డీఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి. చిత్రంలో జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి

మహా కుంభాభిషేకానికి అంకురార్పణ



మహాకుంభాభిషేక మహోత్సవానికి పసుపు, కుంకుమ, ఫలపుష్పాదులు తీసుకెళ్తున్న మంత్రి దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోసంప్రదాయబద్ధంగా మహాకుంభాభిషేక మహోత్సవానికి అంకురార్పణ జరిగింది. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో అధికారులు యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం అర్చకులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ మహాకుంభాభిషేక సంకల్పం, గణపతిపూజ, రుత్విగ్వరణం నిర్వహించారు. ఈ మహిమాన్విత కార్యక్రమంలో విధివిధానముగా కలశాలను నెలకొల్పి, ఆయా కలశాలలో దేవతాశక్తిని నిక్షిప్తం చేసి జప, పారాయణ, ధ్యాన, హోమాదులను జరిపి, ఆ మంత్రపూరిత జలాలలో ఆలయంలోని గర్భాలయ విమానాలను, గోపురాలను, దేవతామూర్తులను అభిషేకంచడం జరుగుతుంది. మహాకుంభాభిషేక మహోత్సవాలకు రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డా.చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



అర్చకులకు వస్త్రాలు అందజేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

రుణాల రికవరీకి ప్రత్యేక బృందాలు

- జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ శివలీల

కర్నూలు(అగ్రికల్చర్): రుణాల రికవరీకి సీనియర్ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి శివలీల తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పాత బకాయిలు దాదాపు రూ.200 కోట్లు ఉండగా, ఇందులో రూ.20 కోట్లు రెన్యువల్ అయిందని, మిగిలిన రూ.180 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు రూ.756 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. ఇప్పటికే రూ.356 కోట్లు వచ్చిందని తెలిపారు. రైతు నేస్తం కింద పంపిణీ చేసిన రుణాల్లో రూ.885 కోట్లు రికవరీ కావాల్సి ఉండగా... ఇప్పటి వరకు రూ.200 కోట్లు రికవరీ అయినట్లు వివరించారు. రాజన్న చేయూత కింద రూ.100 కోట్లు రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.15 కోట్లు రికవరీ అయిందని పేర్కొన్నారు. కర్షకజ్యోతి కింద రూ.576 కోట్లు రికవరీ కావాల్సి ఉందని, ఇప్పటి వరకు రూ.150 కోట్లు వచ్చిందని తెలిపారు. మార్చి నెల చివరిలోపు 80 శాతం రికవరీ చేయాలనే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు. జూన్ చివరి నాటికి 100 శాతం రికవరీ చేస్తామని తెలిపారు. గడువులోపు రికవరీ చేయాలని, లేకపోతే వడ్డీపై వడ్డీ, అపరాధ వడ్డీ పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

స్వర్ణ తేజం.. మల్లన్న వైభవం



ఆలయ పురవీధుల్లో స్వర్ణరథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



స్వర్ణరథంపై విహరిస్తున్న స్వామిఅమ్మవార్లు

ధగధగ కాంతులీనుతూ స్వర్ణ రథం ముందుకు కదులుతుండగా.. హరోం..హర..శంకరా, ఓం నమఃశివాయ శివనామస్మరణ మారుమోగుతుండగా.. స్వర్ణ రథంపై ఆది దంపతుల వైభవాన్ని కనులారా చూసిన భక్తులు తన్మయత్వం పొందారు. రథ సప్తమి నాడు శుక్రవారం బంగారు రథంపై భానుడి కిరణాలు పడి పసిడి వర్ణం శోభిల్లగా.. రథంలోని పార్వతీ పరమేశ్వరులు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. నెల్లూరుకు చెందిన రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు సుమారు రూ.11కోట్లకు పైగా నిధులు వెచ్చించి స్వర్ణ రథోత్సవాన్ని తయారు చేయించి దేవస్థానానికి విరాళంగా సమర్పించారు. మొట్టమొదటిసారి స్వర్ణ రథోత్సవం నిర్వహించడంతో భక్తులు కనులారా తిలకించారు.

– శ్రీశైలంటెంపుల్

క్లుప్తంగా

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలు

అవుకు: వేములపాడు గ్రామంలో కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలో గొర్రెల కాపరి చౌడం క్రిష్ణుడు కంచెను ఏర్పాటు చేసి, అందులో గొర్రె పిల్లలను ఉంచారు. గొర్రెల కాపరి పనుల నిమిత్తం బయటికి వెళ్లగా కుక్కలు కంచెలోకి చొరబడ్డాయి. గొర్రె పిల్లలను గాయపరచడంతో దాదాపు 60 మృతి చెందాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు బాలిక ఆత్మహత్య


మృతిచెందిన లక్ష్మీప్రియాంక

డోన్ టౌన్: రాత్రి వేళ సెల్‌ఫోన్ చూడొద్దని తల్లిదండ్రులు మందలించడంతో ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శుక్రవారం డోన్ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. డోన్ పట్టణం శ్రీరామ్‌నగర్‌కు చెందిన చాకలి బద్రీకి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో చిన్న కుమార్తె అయిన లక్ష్మీప్రియాంక (13) పట్టణంలోని ఒక ప్రైవేట్ స్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఇంటిలో రాత్రిపూట సెల్‌ఫోన్ చూస్తుండటంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక శుక్రవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధిలో డోన్ అగ్రపథం

- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన
- రూ. 45 కోట్లతో చేసిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం


బూరుగలలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


జలదుర్గం షాదీఖానాలో ముస్లింలతో మంత్రి బుగ్గన


ప్యాపిలి: అభివృద్ధిలో డోన్ నియోజకవర్గం అగ్రపథంలో నిలిచిందని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ప్యాపిలి మండల పరిధిలోని పలు గ్రామాల్లో రూ. 46 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు తదితరులతో కలసి మంత్రి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జలదుర్గం గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. డోన్ నియోజకవర్గాన్ని గతంలో పాలించిన రాజకీయ ఉద్దండులు ఏం అభివృద్ధి చేశారో ప్రజలు గమనించాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కరోనా వంటి విపత్కర పరిస్థితులను సైతం ఎదుర్కొని నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపామన్నారు. తాను చేసిన అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేకపోతున్న టీడీపీ నాయకులు విమర్శలు చేయడం అవివేకమన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు చెప్పే మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్న విషయాన్ని టీడీపీ నాయకులు గమనించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమర్థవంతంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ నమ్మకంతోనే ప్రతి కుటుంబంలో ప్రభుత్వం నుంచి మంచి జరిగి ఉంటేనే వచ్చే ఎన్నికల్లో తమను గెలిపించాలని ముఖ్యమంత్రి చెబుతున్నారని మంత్రి అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దిలీప్ చక్రవర్తి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, సర్పంచులు భువనేశ్వరమ్మ, రామలక్ష్మీబాయి, మహేశ్వరి, దస్తగిరమ్మ, దస్తగిరి బూరుగల, పీఆర్‌పల్లి, జలదుర్గం వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ శ్యాంసుందర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, తులసీరెడ్డి, ప్రేంసాగర్ రెడ్డి, మల్రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జలదుర్గం రసూల్, కొండారెడ్డి, జమాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం నుంచి రాత్రి వరకు మంత్రి బుగ్గన సుడిగాలి పర్యటన

అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆర్థికమంత్రి సుడిగాలి పర్యటన చేశారు.

- పీఆర్ పల్లి గ్రామంలో రూ. 3.4 కోట్లతో నిర్మించిన పీఆర్‌పల్లి –గుడిపాడు రోడ్డును మంత్రి ప్రారంభించారు.
- పీఆర్ పల్లిలో రూ. 83 లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ భవనాలను మంత్రి ప్రారంభించారు.
- గుట్టలపల్లిలో రూ. 1 కోటితో నిర్మించిన హుసేనాపురం –గుట్టలపల్లి రోడ్డు. కంబగిరిస్వామి ఆలయం వద్ద రూ. 1 కోటితో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు.
- సీతమ్మతండాలో రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, బూరుగలలో రూ. 1.5 కోట్లతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు.
- రాచర్లలో రూ. 34.80 కోట్లతో 21 కిలోమీటర్ల మేర కొత్తగా వేసిన గార్లదిన్నె–బూరుగల–కోన రోడ్డును ప్రారంభించారు.
- జలదుర్గంలో రూ. 2 కోట్లతో నిర్మించిన రోడ్డు, రూ. 1 కోటితో నిర్మించిన షాదీఖానా, రూ. 28 లక్షలతో నిర్మించిన లైబ్రరీ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా బూరుగల, జలదుర్గం గ్రామాల్లో ఆర్థికశాఖ మంత్రికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మేళతాళాల స్వాగతం పలుకుతూ పూలవర్షం కురిపిస్తూ ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు.

రామేశ్వరుడికి భాస్కరుడి కిరణాభిషేకం


రామేశ్వరస్వామిపై సూర్య కిరణాలు పడుతున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: పలుకూరు గ్రామంలో వెలసిన శ్రీ రామేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం శివలింగంపై సూర్యకిరణాలు పడడంతో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం 6.55 గంటల నుంచి 7.10 గంటల వరకు సూర్య లేత కిరణాలు స్వామిని అభిషేకించాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శివస్వాములు శివుడికి జలాభిషేకం చేశారు. ఏటా ఉత్తరాయణం మాఘమాసం సప్తమి రోజు శివుడిపై సూర్యకిరణాలు పడుతాయని ఆలయ అర్చకులు భాస్కరయ్య తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

జూపాడుబంగ్లా: తర్తూరు గ్రామ అంచ వద్ద నాటుసారా విక్రయిస్తున్న గువ్వల నాగేషులును అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌ఐ మేరీ జయంతి తెలిపారు. శుక్రవారం ఆమె తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గువ్వల నాగేషుల నుంచి 35 మద్యం సీసాలు, 10లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయిస్తూ పట్టుబడిన నాగేషులుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్

- తిమ్మనాయినపేటలో కొత్తగా పదో తరగతి పరీక్ష కేంద్రం
- డీఈఓ సుధాకర్‌రెడ్డి


మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో చర్చిస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని కష్టపడి చదివితే భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవచ్చని డీఈఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండటంతో శుక్రవారం తిమ్మనాయినపేట, కొలిమిగుండ్లలోని మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసి విద్యార్థులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని కొత్తగా తిమ్మనాయినపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. చుట్టు పక్కల ఉండే ఉన్నత పాఠశాలల విద్యార్థులు పరీక్షల సమయంలో కొలిమిగుండ్లకు రాక పోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పాఠశాలలో ఉన్న వసతులను పరిశీలించారు. పరీక్షల లోగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో బాలికల కోసం హాస్టల్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. పరీక్షల్లో ఒత్తిడికి గురికావద్దని తెలిపారు. ఉదయం, సాయంత్రం మెడిటేషన్ చేయాలని విద్యార్థులకు సూచించారు. మోడల్ స్కూల్‌లో పదో తరగతి పూర్తయ్యాక వేలాది రూపాయలు ఫీజులు చెల్లించి ప్రవేట్ కాలేజీలకు వెళ్లకుండా ఇక్కడే ఇంటర్మీడియట్‌లో చేరాలన్నారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఉపాధ్యాయులతో చర్చించి తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్దుల్‌కలాం, ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లానే లక్ష్యం

- 22 టీబీ ముక్త్‌భారత్ విలేజ్‌లు ఎంపిక
- అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ శారదాబాయి


తరిగోపులలో టీబీ వ్యాధిగ్రస్తునితో మాట్లాడుతున్న అదనపు జిల్లా వైద్యాధికారిణి శారదాబాయి

జూపాడుబంగ్లా: 2025 నాటికల్లా జిల్లాలో టీబీ వ్యాధి నిర్మూలనే లక్ష్యమని అదనపు జిల్లా వైద్యాధికారిణి శారదాబాయి తెలిపారు. శుక్రవారం మండలంలోని తరిగోపుల గ్రామంలో అదనపు జిల్లా వైద్యాధికారిణి శారదాబాయి, జిల్లా మెడికల్ కళాశాల ఎస్పీఎం హెచ్‌ఓడీ సుహాసిని పర్యటించి టీబీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా వైద్యాధికారిణి శారదాబాయి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 2,840 మంది టీబీ వ్యాధిగ్రస్తులుండగా వారిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందజేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 22 టీబీ ముక్త్‌భారత్ గ్రామాలను ఎంపిక చేసి అందులో ప్రతి వెయ్యి మందిలో 30 మందికి టీబీ పరీక్షలు నిర్వహించి వ్యాధినిర్ధారణ చేస్తామన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న టీబీ మందులను ఆరుమాసాల పాటు క్రమం తప్పకుండా వాడటం, బలవర్ధకమైన పౌష్టికాహారం భుజించటం వల్ల వ్యాధినయమవుతుందన్నారు. అలాగే అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ ఇస్తున్నట్లు తెలిపారు. 18 కేజీల కంటే తక్కువ బరువున్నవారు, డయాబెటీస్ వ్యాధిగ్రస్తులు,చైన్‌స్మోకింగ్ చేసే వారు త్వరగా టీబీ వ్యాధిబారిన పడే అవకాశం ఉన్నందున వారికి బీసీజీ వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్, హెల్త్‌సూపర్‌వైజర్ రాముడు, వైద్య ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను డీఆర్వో కె.మధుసూదన్‌రావు ఆదేశించారు. జిల్లాలో 162 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 37,801 విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబరులో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించాలన్నారు. కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూయించాలన్నారు. విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అనువైన సమయంలో ఆర్టీసీ బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఓపెన్ టెన్త్ పరీక్షల కోసం 12, ఇంటర్ పరీక్షల కోసం 9 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మార్చి 30 నుంచి ఏప్రిల్3వ తేదీ వరకు ఓపెన్ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. డీఈఓ శామ్యూల్ మాట్లాడుతూ 162 పరీక్ష కేంద్రాలకు 162 చీఫ్ సూపరింటెండెంట్లు, 162 మంది డిపార్టుమెంట్ అధికారులను నియమించినట్లు చెప్పారు. పరీక్షల పర్యవేక్షణకోసం 7 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): క్రైస్తవుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి కారు రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం సేవకుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవుల శ్మశాన వాటికకు స్థల సేకరణ నిమిత్తం అధికారులకు సూచనలు ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే కరోనా రావడంతో రెండు సంవత్సరాలు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. కేవలం మూడు సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఎక్కడా రాజీ పడకుండా అన్ని పథకాలను అమలు చేశారన్నారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని దేశంలో ఎక్కడాలేని విధంగా అమలు చేశారన్నారు. తండ్రిని మించిన రీతిలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ వైఎస్ విమలమ్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్మన్ సునీతా అమృతరాజ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్వెస్లీ, క్రిస్టియన్ మైనార్టీ సలహాదారు మద్దు బాలస్వామి, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు: కర్ణాటక రాష్ట్రానికి చెందిన 960 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. సి.బెళగల్ మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామం వద్ద మోటార్ సైకిల్‌పై కర్ణాటక మద్యం తరలిస్తున్న పెద్దనేలటూరు గ్రామానికి చెందిన రామచంద్రను అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే అల్వాల గ్రామానికి చెందిన బడేషావలి కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 960మంది టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, రెండు మోటార్‌సైకిళ్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

మల్లన్నసేవలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి


ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుతున్న జగద్గురు పీఠాధిపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి దర్శించుకున్నారు. పీఠాధిపతికి ఆలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని పీఠాధిపతి దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో పీఠాధిపతిని దేవస్థాన అధికారులు వస్త్ర, ఫల సమర్పణలతో సత్కరించారు.


చాబోలు గ్రామ సమీపంలో ఉదయం రహదారిని కమ్మేసిన పొగమంచు,


గోస్పాడులో శుక్రవారం మధ్యాహ్నం ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న రహదారి

పగలు భగభగ.. రాత్రి గజగజ

గోస్పాడు: గత కొద్ది రోజులుగా వాతావరణంలో భిన్న మార్పులు చోటు చేసుకోవడంతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఓ వైపు పగలు ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా.. మరో వైపు రాత్రి వేళ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పగటి వేళ ఉదయం 11 గంటలు దాటిన తర్వాత ఎండ తీవ్రతకు జనం ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఇదే క్రమంలో రాత్రి వేళ చలి గాలులు వణికిస్తున్నాయి. వివిధ పనులు, విధులు నిమిత్తం బయటకు వచ్చే ఉద్యోగులు, ప్రయాణికులు స్వెటర్లు ధరించాల్సి వస్తోంది. తెల్లవారు జామున పొగ మంచు దట్టంగా వ్యాపించి వాహనాల రాకపోకలకు సైతం అంతరాయం ఏర్పడుతోంది. నంద్యాల జిల్లాలో వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. గరిష్ఠంగా 32 – 34 మధ్య నమోదువుతోంది. రాత్రి సమయాల్లో ఉష్ణోగ్రతలు అమాంతం పడి పోతున్నాయి. గడిచిన నాలుగు రోజుల నుంచి తెల్లవారు జామున ప్రాంతంలో 19 నుంచి 21 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇదే క్రమంలో పగటి వేళ ఉష్ణోగ్రతలు పెరగడంతో ఏసీ, కూలర్లు బయటకు తీయడంతో విద్యుత్ వినియోగం అమాంతం పెరిగినట్లు తెలుస్తోంది.